# దీపం క్రింద నీడ

-కోడూరు శ్రీ వేంకటేశ్వరస్వామి

అప్పుడే లంచ్ చేసి కునికిపాట్లు పడుతున్న అటెండెంట్ లక్ష్మయ్య, ఆగకుండా మోగుతున్న బజర్ శబ్దంతో ఉలిక్కిపడి లేచాడు. మత్తుగా స్ప్రింగ్ డోర్ తోసుకుని, నెమ్మదిగా లోపలికెళ్ళి నిలబడ్డాడు. వెంటనే రానందుకు ఏమంటాడో ఏమో అనుకుంటూ నిద్రమత్తు ముఖంతో ఆలోచిస్తూ నిలబడ్డ లక్ష్మయ్యను తేరిపార చూసి, "ఏం? రాత్రి నిద్రపోలేదా లేక పట్టపగలే మందు కొట్టావా? వెళ్ళి సుధాకరాన్ని పిలువు" అన్నాడు ఎస్.ఇ. రామనాథం.

రామనాథం వచ్చిన దగ్గర్నుంచీ ఎవర్నీ నిద్ర పోనీయటం లేదా ఆఫీసులో. పరుగుల మీద పనులై పోవాలి. ఏ విషయాన్నీ నాన్చటం అస్సలు సహించడు. అంతేకాక అన్ని విషయాల్లోనూ యమ స్ట్రిక్ట్. రాజకీయ నాయకుల్ని సైతం లెక్క చేయడనీ, వాళ్ళని తన డ్యూటీకి అడ్డం రాకుండా చూసుకోగల ధైర్య సాహసాలుండటమే కాక, అందుకు కావల్సిన అండదండల్ని సమకూర్చుకోగలడని అంటారు. రామనాథం వచ్చాక చేతులు చెమ్మగిల్లక తెగ ఇబ్బంది పడిపోతున్నారు కొందరా ఆఫీసులో. ఎప్పుడూ ఎవరో ఒకర్ని పిలిచి, ఏదో ఒకటి అడుగుతూనే వుంటాడు. ప్రతి చిన్న విషయాన్నీ పదేపదే గుర్తు చేస్తుంటాడు. అలాగే ప్రస్తుతం సుధాకరాన్ని పిలవమన్నాడు. సుధాకరం వినయంగా ప్రవేశించి, సవినయంగా "నమస్కారం సార్" అన్నాడు.

"ఇంటర్వ్యూలు ఏ తారీఖున?" అన్నాడు రామనాథం, సుధాకరాన్ని కూర్చోమని సైగ చేస్తూ.

'నన్ను పరీక్షించటానికి కాపోతే, నీకు గుర్తు లేకనా నాయనా?' అని మనసులో అనుకుని, అతి వినయంగా "ఎల్లుండి పదిహేనో తేదీన అన్నారు కద్సార్" అన్నాడు సుధాకరం.

"ఊ..." అని తలాడించి, "అందరికీ కాల్ లెటర్స్ వెళ్ళాయా?" అన్నాడు రామనాథం.

"యస్సార్. ఎలిజిబుల్ కాండిడేట్స్ అందరికీ వెళ్ళాయి సార్. ఆ లిస్టు మీకిచ్చాను కద్సార్" అన్నాడు వినయ ప్రదర్శనలో ఏమాత్రం లోపం రానీకుండా.

"సో!... అన్ని ఏర్పాట్లు అయ్యాయన్న మాట."

"అన్నీ అంటే... ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు... వాళ్ళ వివరాలు..." అంటూ నసిగాడు.

"ఆ విషయం మిమ్మల్నడిగానా... మిమ్మల్ని చూడమన్నానా" కటువుగా అన్నాడు రామనాథం.

"లేద్సార్"

"చెప్పినంత వరకే చెయ్యి. బైది బై... నాకోసం ఎవరైనా వి.ఐ.పి.లు ఫోన్ చేస్తే, అవుటాఫ్ స్టేషన్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళానని చెప్పు. మినిష్టర్సయినా సరే... ఎందుకు చెప్పానో అర్థమయిందా."

"అయింది సార్."

❀❀❀

"ఇంటర్వ్యూకి రావల్సిన కేండిడేట్స్ అందరూ వచ్చారా?" సుధాకరాన్నుద్దేశించి అడిగాడు రామనాథం.

"అందరూ... అంటే ఏభై మందికి ముప్పై ఐదు మంది వచ్చారండి ఇప్పటి వరకూ"

"ఓకే! ఇప్పటికే ఆలస్యమయింది. ఇంక వెయిట్ చెయ్యనవసరం లేదు. అందర్నీ వెళ్ళి క్రింద టూరిస్ట్ బస్ ఏర్పాటు చేశాను అందులో కూర్చోమను. మీరు కూడ అన్ని రికార్డ్సు తీసుకుని బస్‌లో కూర్చోండి. నేనొక పది నిమిషాల్లో వస్తాను" అన్నాడు.

సుధాకరానికి చాలా అనుమానాలు కలిగాయి కాండిడేట్స్ అందర్నీ తీసుకుని ఈ విహార యాత్ర



ఎక్కడికనీ, ఇంటర్వ్యూలు ఆఫీసులో కాకపోతే మరెక్కడనీ, మిగతా ఇంటర్వ్యూ బోర్డు మెంబర్స్ ఎవరనీ, ఎప్పుడు ఎక్కడికి వస్తారనీను. కానీ అవన్నీ అడిగితే రామనాథం అక్షింతలు వెయ్యడమే కాదు... ఏకంగా తలంబ్రాలే పోసేస్తాడు. వీడి స్ట్రిక్ట్ పాడుగాను అందర్నీ హడలెత్తిస్తున్నాడు. ముఖ్యంగా తనలాటి వారికి ఇలాంటి సంపాదించుకోవల్సిన అవకాశాలని కూడ పాడు చేస్తున్నాడు. బొత్తిగ ఎడారై పోతోంది. అయినా లంచం తీసుకుంటే ఈయన సొమ్మేం పోయిందో. గవర్నమెంట్ ఆఫీసుల్లో అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేసినందుకే జీతం తీసుకోవాలని, పని చేసినందుకు పై సొమ్ము తీసుకోవాలని, బహుశ ఈయనకి తెలియదేమో. ఈయనది గడ్డి వామి దగ్గర కుక్క చందంగా వుంది. తను తినడు ఇంకొకళ్ళని తిననీయడు. అసలైనా ఇదేం ఇంటర్వ్యూనో, ఎవరు, ఎక్కడ ఎలా ఇంటర్వ్యూ చేస్తారో సీటుకి సంబంధించిన నాకే తెలియకుండా వుంది. పెళ్ళికో, పిక్‌నిక్‌కో వెడుతున్నట్లే ఏర్పాట్లేమిటి? ఈరోజు ఇంటర్వ్యూ వర్క్‌లో వుండే వారందరికీ భోజనాలకి ఏర్పాట్లు చేశాట్ట. సుధాకరం ఆలోచనల్లో వుండగానే సెల్ ఫోన్లో ఎవరితోనో భోజనాల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ కారెక్కాడు రామనాథం. కారు బయల్దేరబోతూంటే, లక్ష్మయ్య పరిగెత్తుకుంటూ వచ్చి, "సార్ కాబినెట్ మినిస్టర్ పర్వతాలరావు గారి పి.ఏ. మీ కోసం లైన్లో వున్నారు సార్ ఆఫీసులో" అన్నాడు ఆయాసపడుతూ.

"పని మీద బయటికెళ్ళానని చెప్పు" అంటూ పోనీమన్నట్టు సైగ చేశాడు కారు డ్రైవర్‌తో.

కారు వెనకే కేండిడేట్స్, అవసరమైన స్టాఫ్‌తో బస్సు బయల్దేరింది. అక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో సిటీకి బయట వున్న బ్రాంచ్ ఆఫీసుకి. అక్కడికి వెళ్ళేవరకూ ఎక్కడికి వెడుతున్నారో ఎవరికీ తెలియదు. కనీసం బస్ డ్రైవర్‌కి కూడ. అతడి పని కారుని ఫాలో అవటమే.

"సార్ నేనొక ఫోన్ చేసుకోవాలి ఒకసారి బస్సు ఆపుతారా'' అన్నాడు ఒక కాండిడేట్, సుధాకరంతో.

"సారీ! ఇంటర్వ్యూ అయ్యాక మీకెన్ని ఫోన్లు కావాలో అన్ని చేసుకోండి. ఇప్పుడు మీకోసం బస్సు ఆపితే, అసలే మనకు వెన్యూ తెలియదు. కారు వెళ్ళే రూట్ మిస్సయితే కష్టం" అన్నాడు సుధాకరం.

సెల్ ఫోన్ తీసి, బ్రాంచ్ ఆఫీసుకి డయల్ చేశాడు రామనాథం.

"హలో! గౌరీశంకర్ స్పీకింగ్" అవతలి గొంతు.

"హలో! అయామ్ రామనాథం. వియార్ ఆన్దవే. మరో పది నిమిషాల్లో అక్కడుంటాం. మేం అక్కడికి వచ్చేలోగా అక్కడి ఆఫీసు టెలిఫోన్ లైన్ కట్ చేయించు. ఇంటర్వ్యూ అయ్యే వరకూ ఫోన్లు రాకూడదు. దట్సాల్" అంటూ కట్ చేశాడు రామనాథం.

బ్రాంచ్ ఆఫీసు జన సంచారం, ఫెసిలిటీస్ అంతగా లేని ప్రదేశంలో ఊరికి దూరంగా వుంది. అందుకే రామనాథం ఇంటర్వ్యూల కోసం ఆ ఆఫీసుని ఎన్నుకున్నాడు. బస్సుని ఫాలో అవుతూ మరో ఇద్దరు బోర్డు మెంబర్లని తీసుకుని మరో కారు వెడుతోంది.

❀❀❀

ఎవరి ఒత్తిడికీ లొంగకుండా, ఎవర్నుంచీ ఏమీ ఆశించకుండా కేవలం ప్రతిభని మాత్రమే పరిగణించి కేండిడేట్‌ని సెలక్ట్ చేసి, ఆర్డర్సు పంపమని ఫైలు సుధాకరం చేతికిచ్చాడు రామనాథం. చక్కటి అవకాశం తన చేజారిపోయిందని సుధాకరానికి చిరాగ్గా వుంది.

*బ్రాంచ్ ఆఫీసు జన సంచారం, ఫెసిలిటీస్ అంతగా లేని ప్రదేశంలో ఊరికి దూరంగా వుంది. అందుకే రామనాథం ఇంటర్వ్యూల కోసం ఆ ఆఫీసుని ఎన్నుకున్నాడు. బస్సుని ఫాలో అవుతూ మరో ఇద్దరు బోర్డు మెంబర్లని తీసుకుని మరో కారు వెడుతోంది.*

తలెత్తకుండా పని చేసుకుంటున్న సుధాకరం "సార్! మొన్న పదిహేనో తారీఖున జరిగిన ఇంటర్వ్యూ తాలూకు సెలక్షన్ గురించి..." అంటూ నసుగుతున్న వ్యక్తి వైపు తేరిపార చూశాడు.

"అలా చెప్పటానికి కుదరదు. అయినా మీరెవరు?"

"నా పేరు బాపిరాజండి. రైల్వేస్‌లో చేస్తాను. మా తమ్ముడు రవివర్మ ఇంటర్వ్యూకి అటెండ్ అయ్యాడు. సెలక్షన్ గురించి కనుక్కోమని రోజూ పోరుతున్నాడు. మీరేం అనుకోకపోతే కొద్దిగ..."

తీక్షణంగా శూన్యంలోకి చూసి, ఏ భావాన్నీ ముఖం మీద ప్రదర్శించకుండా, "సారీ! ఒకే పోస్టు. సెలక్షన్ అయిపోయింది" అన్నాడు, 'మీ తమ్ముడు సెలక్ట్ కాలేదు' అన్న భావాన్ని ధ్వనింపజేస్తూ.

"అలా కేంటీన్‌కి వెళ్ళి మాట్లాడుకుందామా?" అన్నాడు చిగురంత ఆశతో బాపిరాజు.

"ఎందుకు సార్ వృథా ప్రయాస. నేను చెబుతున్నాగా."

"సెలక్షన్ అయిపోతే పోనీండి. జస్ట్ ఫ్రెండ్లీగ వెడదాం రండి."

"సరే పదండి" ఫైలు కట్టేస్తూ అన్నాడు సుధాకరం.

కాఫీకి ఆర్డర్ ఇచ్చి, "చెప్పండి సార్! సెలక్టెడ్ కాండిడేట్ ఎవరు?... మరేం లేదు జస్ట్ తెలుసుకుందామని అడుగుతున్నాను" అన్నాడు వీలైనంత కాజువల్‌గ.

"మీరంత ఇదిగ అడుగుతూంటే నాకు అబద్ధం

చెప్పబుద్ధి కావటం లేదు. నిజానికి మీ తమ్ముడు సెలక్ట్ కావల్సింది. కానీ ఒకోసారి... ఏం చేస్తాంలెండి. మళ్ళీ చెప్పిన కొద్దీ మీకు మరీ బాధ" అన్నాడు వెనకవైపు జుట్టుని వేళ్ళతో దువ్వుకుంటూ.

కాఫీ కప్పు దగ్గరికి లాక్కుంటూ, "ఏం పర్వాలేదు చెప్పండి..." అన్నాడు బాపిరాజు ఉత్సుకతని ఆపుకోలేక ముందుకు వంగుతూ.

"నిజానికి అఫిషియల్ సీక్రెట్స్ లీక్ చెయ్యకూడదు కూడాను..." నసిగాడు సుధాకరం.

"నేనెవరి దగ్గరా అననులెండి."

"నిజానికి మీ తమ్ముడు రవివర్మకి సెలక్ట్ అయిన కాండిడేట్ కంటె తక్కువ మార్కులేం రాలేదు."

"మరి సెలక్షన్ ఎందుకు కాలేదు?"

"మీ తమ్ముడితో పాటు మరో వ్యక్తికి కూడ సమానంగా మార్కులొచ్చాయి. అక్కడే సందిగ్ధంలో పడింది బోర్డు". రిలాక్స్‌డ్‌గ వెనక్కి వాలి సిగరెట్ వెలిగించాడు సుధాకరం.

"వీరిద్దరి మధ్య మళ్ళీ టెస్ట్ పెట్టవల్సింది."

"ఇదేమన్నా ఫుట్‌బాల్ మ్యాచా, టై బ్రేకర్ పెట్టడానికి" అన్నాడు నవ్వుతూ సుధాకరం.

"మరి మావాడ్ని ఏ కారణంగా తప్పించారు?"

"రెండో కాండిడేట్‌కి ఆరోజుతో ఏజ్‌బార్ అయిపోతోందనే సింపతీ మీద. ఈ ఛాన్స్ పోతే అతనికి మళ్ళీ ఛాన్స్ వుండదని, ఒక అరమార్కు కలిపి అతడ్ని సెలక్ట్ చేసింది బోర్డు" చక్కగా వర్ణించాడు ఇంటర్వ్యూ రూమ్‌లోకి కూడ వెళ్ళని సుధాకరం.

"అయితే ఇప్పుడిక ఏమీ చెయ్యలేమా?"

"ఈ స్టేజ్‌లోనా... చాలా కష్టం" పెదవి విరుస్తూ అన్నాడు సుధాకరం.

"కష్టం కాకపోతే మీ సహాయం ఎందుకు అడుగుతాను సార్."

తీక్షణంగా ఆలోచించినట్టు... శూన్యంలోకి చూసి, "సరే మీరు అంతగా ప్రాధేయపడుతున్నారు కనుక నా ప్రయత్నం నేను చేస్తాను. కాకపోతే ఖచ్చితంగా మాటివ్వలేను. ఎందుకంటే, పెద్దవాళ్ళతో వ్యవహారం. ఏమాత్రం బెడిసినా నా ఉద్యోగానికే ఎసరు. మీవాడు నిజంగా ప్రతిభ వున్న కాండిడేట్ అవటం వల్ల ఈమాత్రం రిస్కైనా తీసుకుంటున్నాను."

"మళ్ళీ ఎప్పుడు కలవమంటారు?"

"మీరింకేం కలవనవసరం లేదు. రేపు సాయంత్రం ఇంటికి వచ్చేయండి... ఒక పాతిక వేలు తీసుకుని."

"మరీ ఎక్కువేమో?"

"విషయం మీకు చెప్పాను. ఆపైన మీ ఇష్టం."

"వారంలోగా ఆర్డర్స్ వస్తాయి. ఒకవేళ నా ప్రయత్నం వృధా అయినా, మీ డబ్బుకేం ఢోకా లేదు. నన్ను మీరు మనస్ఫూర్తిగా నమ్మండి" అన్నాడు అవసరమైనంత వరకే నమ్మకద్రోహం చేస్తూ సుధాకరం.

"ఛఛ! మిమ్మల్ని నమ్మకపోవడమేమిటండీ" అన్నాడు బాపిరాజు తను నమ్మటం వల్లనే అతడు నమ్మకద్రోహం చెయ్యగలిగాడనే విషయం, తన తమ్ముడే అసలు సెలక్టయిన కేండిడేట్ అనే విషయం తెలుసుకోలేక.

❀❀❀

ఉపసంహారం:

ఎంతో రిస్క్ తీసుకుని, మినిష్టర్ల రికమండేషన్‌లకి కూడ లొంగకుండా తెలివిగా జాగ్రత్తలు తీసుకుని నిజమైన ప్రతిభ వున్న రవివర్మని సెలక్ట్ చేశాడు రామనాథం. డబ్బుకి, పవర్‌కి లొంగకుండా ధైర్యంగా పని చేసే రామనాథం లాంటి అరుదైన ఆఫీసర్లు నిజంగా అభినందనీయులు.

ప్రతిభ గల రవివర్మ రామనాథం నిజాయితీ వల్ల సెలక్టయినా, ఇసుకలోంచి తైలం తీయగల సుధాకరం మోసానికి బలికాక తప్పలేదు.

ఈ సమాజంలో రవివర్మలకి ప్రతిభ ఒక్కటీ వుంటే చాలదు, తమ ప్రతిభ మీద తమకి నమ్మకం వుండాలి. రామనాథాలకి దొడ్డ మానులను కూల్చే ధైర్య సాహసాలు, నిజాయితీ ఒక్కటే చాలదు, సుధాకరం లాంటి గడ్డ పరకల్ని సైతం పెకలించే నేర్పూ వుండాలి.

○